కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

భారత రాజ్యాంగం ద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన జరిగినప్పటికీ, రాష్ట్రాలకు పూర్తిస్థాయి స్వతంత్ర ప్రతిపత్తి లేదు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో... అధికార విభజనకు సంబంధించిన మూడు జాబితాలతో పాటు అవశిష్ట అధికారాలకు సంబంధించిన అంశాలను గురించి కూడా పేర్కొన్నారు. 11వ భాగంలో కేంద్రం-రాష్ట్రాల మధ్య ఉన్న శాసన, పరిపాలనా సంబంధాలను, 12వ భాగంలో ఆర్థిక సంబంధాలను పొందుపరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ పరిధిలో స్వతంత్ర అధికారాలను కలిగి ఉన్నప్పటికీ చాలా విషయాల్లో కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారం ఉంటుంది. అందువల్లే డి.ఎన్. బెనర్జీ భారత సమాఖ్యను సహకార సమాఖ్యగా అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్రాల అధికారాలకు సంబంధించిన అనేక అంశాలను 1935 భారత ప్రభుత్వ చట్టం నుంచి గ్రహించారు.

అధికారాల విభజన

కేంద్ర జాబితా: ఈ జాబితాలో మొదట్లో 97 అంశాలు ఉండగా ప్రస్తుతం 99 అంశాలు ఉన్నాయి. ఈ జాబితాలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ అధికారం ఉంటుంది. పార్లమెంటు శాసనాలను రూపొందిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం ఉన్న కేంద్ర జాబితాలోని ముఖ్య అంశాలు... దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, విమానయానం, నౌకాయానం, రైల్వేలు, పోస్టాఫీసులు, యుద్ధం, శాంతి, పౌరసత్వం, సుప్రీంకోర్టు, హైకోర్టు, కమ్యూనికేషన్స్, ఆకాశవాణి, దూరదర్శన్, మందుగుండు సామగ్రి మొదలైనవి.

రాష్ట్ర జాబితా: ప్రాంతీయ ప్రాముఖ్యమున్న 66 అంశాలను రాష్ట్ర జాబితాలో పొందుపరిచారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ జాబితా నుంచి 5 అంశాలను తొలగించి ఉమ్మడి జాబితాలో పొందుపచారు. ప్రస్తుతం ఈ జాబితాలో 61 అంశాలున్నాయి. వీటిలో వ్యవసాయం, భూమిశిస్తు, శాంతి భద్రతలు, జైళ్లు, నీటిపారుదల, స్థానిక స్వపరిపాలన, రోడ్డు రవాణా, ప్రజా ఆరోగ్యం, వినోదం, ఎక్సైజ్ మొదలైనవి ఉన్నాయి. ఈ జాబితాలో పేర్కొన్న అంశాలన్నింటిపై శాసనాలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో అవి పరిమితులకు అంటే కేంద్ర ప్రభుత్వం అజమాయిషీకి లోబడి వ్యవహరించవలసి ఉంటుంది.

ఉమ్మడి జాబితా: ప్రస్తుతం ఈ జాబితాలో 52 అంశాలున్నాయి. న్యాయపాలన, అడవులు, జనాభా నియంత్రణ, విద్య, తూనికలు, కొలతలు వంటి 5 అంశాలను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ జాబితాలో చేర్చారు. వివాహం, విడాకులు, వారసత్వం, విద్యుత్, ధర్మాదాయ సంస్థలు, వార్తాపత్రికలు, ప్రింటింగ్, సామాజిక బీమా, కార్మిక వ్యవహారాలు మొదలైన అంశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ అంశాలపై శాసనాలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకూ ఉంది.

అవశిష్ట అధికారాలు: కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో పొందుపరచని, కొత్త అంశాలను అవశిష్ట అధికారాలుగా పేర్కొంటారు. అవశిష్ట అధికారాలు కేంద్రం పరిధిలోకి వస్తాయి. వీటిని సుప్రీంకోర్టు నిర్ణయిస్తుంది. **ఉదాహరణ :** అంతరిక్ష పరిశోధన

శాసన సంబంధాలు (245-256)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారాల విభజనను అనుసరించి ఆయా ప్రభుత్వాలకు తమ పరిధిలో శాసనాలు రూపొందించి అమలుపరిచే అధికారాలున్నప్పటికీ... కొన్ని సందర్భాల్లో కేంద్రం రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా శాసనాలను రూపొందించవచ్చు. అదేవిధంగా కొన్ని పరిపాలన బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించవచ్చు.

- 248 అధికరణను అనుసరించి అవశిష్ట అధికారాలపై కేంద్ర ప్రభుత్వం శాసనాలను రూపొందిస్తుంది
- 249 అధికరణను అనుసరించి... రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశం జాతీయ ప్రాముఖ్యమైందని కేంద్రం భావించి, రాజ్యసభలో 2/3 వంతు మెజార్టీతో ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంటు శాసనం చేస్తుంది.
- దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించినపుడు... 250 అధికరణ ప్రకారం రాష్ట్ర జాబితాపై కూడా కేంద్రం శాసనాలు చేస్తుంది.
- 252 అధికరణ ప్రకారం... రెండు లేదా అంత కంటే ఎక్కువ రాష్ట్రాలు ఏదైనా రాష్ట్ర అంశంపై శాసనం రూపొందించాలని కేంద్రాన్ని కోరినపుడు కూడా కేంద్రం శాసనం చేయవచ్చు.
- 253 అధికరణ ప్రకారం.. కేంద్రం అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకున్నప్పుడు పార్లమెంట్ రూపొందించే చట్టాలను రాష్ట్రాలు పాటించాలి.
- ఉమ్మడి జాబితాలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేంద్రం, రాష్ట్రాలు కలిగిఉన్నప్పటికీ ఒకే అంశంపై కేంద్రం, రాష్ట్రాలు వేర్వేరు చట్టాలు చేస్తే.. కేంద్ర శాసనమే చెల్లుబాటు అవుతుంది.
- రాష్ట్రాలు రూపొందించిన చట్టాలను గవర్నర్లు ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలనకు కేంద్రానికి పంపినట్లయితే 201 అధికరణ ప్రకారం రాష్ట్రపతి ఆమోదం పొందడం తప్పనిసరి.

పరిపాలనా సంబంధాలు (256-263)

- రాజ్యాంగం ప్రకారం కేంద్రం, రాష్ట్రాల మధ్య పరిపాలనా సంబంధాల్లో స్పష్టత ఉన్నప్పటికీ ఈ రెండింటికీ మధ్య సన్నిహిత సహకార సంబంధాలు కూడా ఉన్నాయి. అనేక సందర్భాల్లో కేంద్రం రాష్ట్రాలకు పరిపాలనా విధులను అప్పగించవచ్చు. కేంద్రం రాష్ట్ర విషయాల్లో జోక్యం చేసుకోవచ్చు. అదేవిధంగా రాష్ట్రాలు కేంద్రం నుంచి సహాయ, సహకారాలు పొందవచ్చు.
- రాష్ట్రాలు పార్లమెంటు శాసనాలకు విరుద్ధంగా తమ కార్యకలాపాలను నిర్వహించరాదు.
- 257 అధికరణ ప్రకారం కేంద్ర పరిపాలనా ఆదేశాలను రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాలి.
  ఉదాహరణ : జాతీయ ఆస్తుల సంరక్షణ
- 258 అధికరణను అనుసరించి కేంద్రం కోరిన కొన్ని నిర్మాణాలను రాష్ట్రాలు చేపట్టాలి. వాటికి అయ్యే వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది.
- 262 అధికరణ ప్రకారం... అంతర్ రాష్ట్ర నదీ జలాల పంపకానికి సంబంధించిన ట్రిబ్యునళ్లు, కమిషన్లను కేంద్రమే నియమిస్తుంది.
- 263 అధికరణ ప్రకారం కేంద్రం, రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను, పరిష్కరించడం కోసం అంతర్ రాష్ట్ర కౌన్సిల్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తుంది.
- 365 అధికరణను అనుసరించి కేంద్ర ప్రభుత్వం జారీచేసే పరిపాలనా ఆదేశాలను రాష్ట్రాలు పాటించకపోతే కేంద్రం వాటిపై చర్య తీసుకోవచ్చు.
- ఏదైనా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినపుడు ఆ రాష్ట్ర పరిపాలనను కేంద్రమే నిర్వహిస్తుంది.

ఆర్థిక సంబంధాలు (264-300)

- ఆర్థిక విషయాల్లో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలున్నాయి.
- కార్పొరేట్ టాక్స్, ఎగుమతులు, దిగుమతులు, కేంద్ర ఎక్సైజ్ వంటి 14 అంశాలపై సుంకాలు విధించే అధికారం కేంద్రానికి ఉంది.
- భూమిశిస్తు, రోడ్డు రవాణా, వినోదం, ఎక్సైజ్ వంటి 20 అంశాలపై పన్నులు విధించే అధికారం రాష్ట్రాలకు ఉంది.
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న 3 అంశాలపై పన్నులు విధించే అధికారం కేంద్రానికి ఉన్నప్పటికీ వాటిలో రాష్ట్రాలకూ కొంత వాటా ఉంటుంది.
- 268 అధికరణ ప్రకారం... కొన్ని పన్నులను కేంద్రమే విధించినప్పటికీ రాష్ట్రాలు వసూలు చేసి, వినియోగిస్తాయి.
  ఉదాహరణ: స్టాంప్ డ్యూటీ, మందులు, అలంకరణ వస్తువులు, పాలసీ మార్పిడిలపై పన్నులు.
- 269 అధికరణ ప్రకారం కొన్ని పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేస్తుంది. కానీ వాటిని రాష్ట్రాలకు కేటాయిస్తుంది.
  ఉదాహరణ: నౌకాయానం, విమానయానం, రైల్వే ప్రయాణికులపై విధించే పన్నులపై సర్ ఛార్జీలు.
- 270 అధికరణ ప్రకారం కేంద్రమే విధించి, వసూలు చేసే కొన్ని పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇస్తుంది. **ఉదాహరణ:** ఆదాయపన్ను
- 280 అధికరణ ప్రకారం ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్రమే నియమిస్తుంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు..

1. ఉమ్మడి జాబితా విషయంలో కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం ఉన్నపుడు?
ఎ) కేంద్ర శాసనం నెగ్గుతుంది
బి) రాష్ట్ర శాసనాలు నెగ్గుతాయి
సి) సుప్రీంకోర్టు వివాదాన్ని పరిష్కరిస్తుంది
డి) వివాదం నెలకొన్న అంశాలు రద్దవుతాయి

2. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ఎవరి సమ్మతితో రాష్ట్రాలకు విధులను అప్పగిస్తుంది?
ఎ) రాష్ట్రపతి బి) సుప్రీంకోర్టు
సి) పార్లమెంట్ డి) రాష్ట్ర ప్రభుత్వం

3. రాజ్యాంగంలోని ఏ అధికరణాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను విదేశీ దాడులు, అంతర్గత అల్లకల్లోలాల నుంచి కాపాడాలి?
ఎ) 215 అధికరణ బి) 315 అధికరణ
సి) 355 అధికరణ డి) 358 అధికరణ

4. విదేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలుపరచడానికి పార్లమెంట్ శాసనాలు చేసేటపుడు ఎవరి అనుమతి పొందాలి?
ఎ) అన్ని రాష్ట్రాలు బి) మెజార్టీ రాష్ట్రాలు
సి) సంబంధిత రాష్ట్రాలు డి) రాష్ట్రాల అనుమతి అవసరం లేదు

5. కింది అంశాల్లో దేనిపై కేంద్రం పన్నులు విధిస్తే రాష్ట్రాలు వసూలు చేసి వినియోగిస్తాయి?
ఎ) స్టాంప్ డ్యూటీ బి) రైల్వే ప్రయాణికులు
సి) ఎస్టేట్ డ్యూటీ డి) పత్రికలపై పన్నులు

6. రాష్ట్ర జాబితాలో పేర్కొన్న విషయాల మీద పార్లమెంట్ ఎప్పుడు శాసనం చేస్తుంది?
ఎ) రాజ్యసభ సాధారణ మెజారిటీతో తీర్మానించినపుడు
బి) రాజ్యసభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానం ఆమోదించినపుడు
సి) రాష్ట్ర శాసనసభలు తీర్మానించినపుడు
డి) లోక్‌సభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానించినపుడు

జవాబులు	1	2	3	4	5	6
	A	D	B	D	A	B

భారతదేశం - కేంద్ర, రాష్ట్ర సంబంధాలు

మన దేశంలో కేవలం పాలనా సౌలభ్యం కోసమే సమాఖ్య విధానాన్ని అనుసరించాం. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను నెలకొల్పాల్సిన ఆవశ్యకతను రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. అధికార పంపిణీ జాబితాలను ఏడో షెడ్యూల్లో పొందుపరిచారు. 11వ భాగం కేంద్ర - రాష్ట్రాల మధ్య శాసన, పరిపాలనా సంబంధాలను, 12వ భాగం ఆర్థిక సంబంధాల గురించి చర్చిస్తుంది. కేంద్ర - రాష్ట్రాల మధ్య అధికారాల విషయంలో 1967 వరకు ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాలేదు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం దీనికి ప్రధాన కారణం. దీనికి తోడు 1964 వరకు నెహ్రూ నాయకత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకపోవడం.

నాలుగో సాధారణ ఎన్నికల తర్వాత అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగంలోని కేంద్రీకృత ధోరణిని ప్రశ్నించడం ఆరంభించాయి. రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలని డిమాండ్ చేయడంతో సమస్య జటిలమైంది. పశ్చిమబెంగాల్ వామపక్ష ప్రభుత్వం, పంజాబ్‌కు చెందిన అకాళీదళ్ ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం.. లాంటివి అనేక సమస్యలను ముందుకు తెచ్చాయి.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరిచే దిశలో తీసుకోవాల్సిన చర్యలు సూచించాల్సిందిగా కోరుతూ ఇందిరాగాంధీ ప్రభుత్వం మొదటి పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం రాజమన్నార్ కమిటీని, 1983లో ఇందిరాగాంధీ సర్కారియా కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్లు అనేక సూచనలు చేశాయి. 2002లో వేసిన రాజ్యాంగ సమీక్ష కమిషన్ కూడా కొన్ని ప్రత్యేక సూచనలు చేసింది. సర్కారియా కమిషన్ సూచనల అమలు తీరు పరిశీలించడానికి 2007లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం మదన్ మోహన్ పూంచీ నేతృత్వంలో ఐదు మంది సభ్యులతో కమిషన్ ఏర్పాటు చేసింది. ఇది నివేదికను సమర్పించాల్సి ఉంది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, వాటికోసం నియమించిన కమిషన్లపై అనేక ప్రశ్నలు వివిధ పోటీ పరీక్షల్లో అడుగుతున్నారు. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

1. వీటిలో ఏడో షెడ్యూల్లో పేర్కొని, రాష్ట్ర జాబితాలో పేర్కొనని అంశం? (సివిల్స్- పి.ఎ.2007)

ఎ) వికలాంగులు, నిరుద్యోగులకు పునరావాసం
బి) భూముల, భవనాలపై పన్నులు
సి) జైళ్లు డి) స్టాక్ ఎక్స్ఛేంజీలు

సమాధానం: డి

వివరణ: మొదటి మూడు అంశాలు రాష్ట్ర జాబితాలో పేర్కొంటే.. స్టాక్ మార్కెట్లు కేంద్ర జాబితాలో ఉన్నాయి. కార్పొరేట్ పన్నులు కూడా కేంద్ర జాబితాలోనే ఉన్నాయి.

2. రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశంపై పార్లమెంట్ శాసనం చేయాలంటే.. ఏ సభ తీర్మానం అవసరం? (సివిల్స్ పిఎ-2007)

ఎ) లోక్‌సభ బి) రాజ్యసభ
సి) రాజ్యసభ, లోక్‌సభ
డి) లోక్‌సభ, రాజ్యసభ, ఆ రాష్ట్ర శాసనసభ

సమాధానం: బి

వివరణ: రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశానికి జాతీయ ప్రాముఖ్యం ఉందని రాజ్యసభ 249 అధికరణ ప్రకారం 2/3 వంతు మెజారిటీతో ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదిస్తే.. పార్లమెంట్ ఆ అంశంపై శాసనం చేయొచ్చు. ఏడాది పాటు అది అమల్లో ఉంటుంది.

3. సామాజిక, ఆర్థిక ప్రణాళిక ఏడో షెడ్యూల్లోని ఏ జాబితాలో ఉంది? (సివిల్స్ - 2006, గ్రూప్ -2, 2008)

ఎ) కేంద్ర బి) రాష్ట్ర
సి) ఉమ్మడి డి) ఏ జాబితాలోనూ లేదు

సమాధానం: సి

వివరణ: సామాజిక, ఆర్థిక ప్రణాళిక ఉమ్మడి జాబితాలో ఉంది. జాతీయ ప్రణాళికలు, రాష్ట్ర ప్రణాళికల రూపకల్పనలో ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్రణాళిక సంఘం కీలక పాత్ర పోషిస్తుంది.

4. భారత్ లాంటి దేశాలకు అనువైన ఉత్తమ సమాఖ్యవాదం? (సివిల్స్ పీఎస్ - 2003)

ఎ) కేంద్రీకృత బి) బేరమాడే
సి) సహకార డి) ఘర్షణాయుత

సమాధానం: సి

వివరణ: భారత్ లాంటి మూడో ప్రపంచ దేశాలకు సహకార సమాఖ్యే ఉత్తమ విధానం. దేశాభివృద్ధికి కేంద్రీకృత, ఘర్షణాయుత ధోరణి కంటే.. కేంద్ర, రాష్ట్రాల మధ్య సన్నిహిత, సహకార సంబంధాలు తప్పనిసరి. మన దేశాన్ని సహకార సమాఖ్యగా గ్రాన్‌విలే ఆస్టిన్, డీఎన్ బెనర్జీలు వర్ణించారు.

5. వీటిలో ఏ పన్నులను కేంద్రం విధించి, రాష్ట్రాలు వసూలు చేసుకుంటాయి? (సివిల్స్ - 1994)

ఎ) స్టాంపు బి) ప్రయాణికులు, వస్తువుల రవాణా
సి) ఎస్టేట్ డ్యూటీ డి) పత్రికలపై

సమాధానం: ఎ

వివరణ: రాజ్యాంగంలోని 268 అధికరణ ప్రకారం కేంద్రం కొన్ని పన్నులను విధిస్తుంది. వాటిని రాష్ట్రాలు వసూలుచేసి, వినియోగించుకుంటాయి. వాటిలో ముఖ్యమైన పన్ను -స్టాంపు డ్యూటీ.

6. మన దేశంలో కేంద్ర - రాష్ట్ర సంబంధాలు మున్సిపల్ సంబంధాలుగా పిలువడానికి కారణం? (సివిల్స్-1994)

ఎ) శాసన వ్యవహారాల్లో రాష్ట్రాన్ని కేంద్రం నియంత్రించడం
బి) ఆర్థిక వ్యవహారాల్లో రాష్ట్రాన్ని కేంద్రం నియంత్రించడం
సి) పరిపాలనా సంబంధ వ్యవహారాల్లో రాష్ట్రాన్ని కేంద్రం

నియంత్రించడం

డి) ప్రణాళికా రంగంలో రాష్ట్రాన్ని కేంద్రం నియంత్రించడం

సమాధానం: డి

వివరణ: ప్రణాళికా ప్రాధాన్యాన్ని కేంద్ర ప్రణాళికా సంఘం నిర్ణయించడం. ఆ ప్రాధాన్యం ఆధారంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక నిధులను కేంద్ర ఫైనాన్స్ కమిషన్ పంపిణీ చేయడం.. ఇలాంటి కార్య క్రమాల ద్వారా కేంద్రపై ఆధారపడి రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి కావాల్సిన ఆర్థిక వనరులను సమీకరించుకుంటున్నాయి.

7. కేంద్ర – రాష్ట్ర సంబంధాలు రాజ్యాంగంలోని ఏ అధికరణల ద్వారా అమలవుతాయి?

(జూనియర్ అసిస్టెంట్ – 2007)

ఎ) 245–263 బి) 148–151

సి) 264–307 డి) 79–123

సమాధానం: ఎ

వివరణ: రాజ్యాంగంలోని 11వ భాగంలోని 245– 263 అధికరణల్లో కేంద్ర – రాష్ట్రాల మధ్య శాసన, పరిపాలనకు సంబంధించిన సంబం ధాల గురించి ప్రస్తావించారు.

8. ఏ సంస్కరణల కోసం సర్కారియా కమిషన్‌ను నియమించారు?

(ఎఫ్ఆర్ఓ–2005)

ఎ) ద్వంద్వ పౌరసత్వం బి) కేంద్ర, రాష్ట్ర సంబంధాలు

సి) న్యాయ సంస్కరణలు

డి) పోలీసు పాలనా విషయాలు

సమాధానం: బి

వివరణ: 1983లో ఇందిరాగాంధీ ప్రభుత్వం కేంద్ర – రాష్ట్ర సంబం ధాలు అధ్యయనం చేసి, తగిన సూచనలు చేయడానికి జస్టిస్ ఆర్ఎస్ సర్కారియా అధ్యక్షతన ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

9. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్–ఇన్–ఎయిడ్ ఉద్దేశం?

(ఎంపీడీవో–1998)

ఎ) కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను పెంపొందించడం

బి) రాష్ట్రాలకు కేంద్రం లాంఛనంగా సహాయం చేయడం

సి) రాష్ట్రాల అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడానికి రెవెన్యూ అకౌంట్‌లో ఏర్పడే లోటును పూడ్చడం

డి) రాష్ట్రాల ప్రణాళికా వ్యయాన్ని భరించడం

సమాధానం: సి

వివరణ: 275 అధికరణ ప్రకారం ఫైనాన్స్ కమిషన్ సూచనలను అనుసరించి కేంద్ర సంఘటిత నిధి నుంచి రాష్ట్రాల అభివృద్ధి, రెవెన్యూ లోటును పూడ్చడం కోసం రాష్ట్రాలకు సహాయక నిధులను కేంద్రం అందిస్తుంది.

10. ఏ విధంగా రాష్ట్రాల సరిహద్దులను పార్లమెంట్ మార్పు చేయొచ్చు?

(ఎంపిడివో – 1997)

ఎ) రాష్ట్రాల సమ్మతితో

బి) రాష్ట్రాల సమ్మతి లేకుండానే

సి) విదేశీ దురాక్రమణల కారణంగా

డి) రాష్ట్రాలు అప్పీలు చేసినపుడు

సమాధానం: బి

వివరణ: రాజ్యాంగంలోని మూడో అధికరణ ద్వారా పార్లమెంట్ రాష్ట్రాల సరిహద్దులను రాష్ట్రాల అనుమతి లేకుండానే మార్చవచ్చు. ఈ అంశం మన రాజ్యాంగంలో కేంద్రం ఆధిపత్యాన్ని తెలియజేస్తుంది.

11. వీటిలో కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి, రాష్ట్రాలు ఇచ్చే పన్ను? (గ్రూప్–1,2004)

ఎ) ఎగుమతి – దిగుమతులపై సుంకాలు

బి) స్టాంపు డ్యూటీ సి) ఆదాయ పన్ను

డి) రైలు ఛార్జీలపై విధించే పన్ను

సమాధానం: డి

వివరణ: 269 అధికరణను అనుసరించి రైలు ఛార్జీలపై పన్నులు కేంద్రమే విధించి, వసూలు చేస్తుంది. కానీ వచ్చే ఆదాయం రాష్ట్రాలకు కేటాయిస్తుంది.

12.వీటిలో భారతీయ సమాఖ్య వ్యవస్థ విషయంలో తప్పుగా ప్రకటిం చిన వాక్యం?

(గ్రూప్–2, 2003)

ఎ) ఉమ్మడి జాబితా మీద రాష్ట్రాలు మాత్రమే శాసనాలు చేస్తాయి

బి) కేంద్ర జాబితా మీద కేంద్ర ప్రభుత్వం శాసనాలు చేస్తుంది

సి) అవశిష్ట అధికారాలు కేంద్రానివే

డి) ప్రత్యేక పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర జాబితా మీద శాసనాలు చేస్తుంది.

సమాధానం: ఎ

వివరణ: 254 అధికరణ ప్రకారం ఉమ్మడి జాబితాపై కేంద్ర–రాష్ట్రాలు శాసనాధికారాన్ని కలిగిఉన్నప్పటికీ ఒకే అంశంపై కేంద్రం–రాష్ట్రాలు వేర్వేరు శాసనాలు చేస్తే కేంద్ర శాసనం నెగ్గుతుంది.